మహిళల ఆర్థికాభివృద్ధికి చేయూత

- ఏలూరులో 15,650 మందికి రూ.19.23 కోట్ల లబ్ధి
- త్వరలో నాలుగో విడత సున్నా వడ్డీ విడుదల
- స్వయం సహాయక సంఘాలు 1,565

ఏలూరు (టూటౌన్): మహిళల ఆర్థికాభివృద్ధికి ప్రభుత్వం పెద్దపీట వేసింది. రాష్ట్రంలోని మహిళలను ఆర్థికంగా శక్తివంతులను చేసేందుకు ప్రభుత్వం పలు సంక్షేమ, అభివృద్ధి పథకాలను అమలు చేస్తోంది. ఆసరా, చేయూత, కాపునేస్తం, ఈబీసీ నేస్తం, సున్నావడ్డీ, అమ్మఒడి వంటి పథకాల ద్వారా మహిళలకు ఆర్థిక సహకారం అందిస్తూ.. మహిళలు సాధికారత సాధించే విధంగా కృషి చేస్తోంది. డ్వాక్రా మహిళలు బ్యాంకుల్లో తీసుకున్న బ్యాంక్ లింకేజీ రుణాలను క్రమం తప్పకుండా చెల్లించిన వారికి వైఎస్సార్ సున్నా వడ్డీ పథకం ద్వారా పూర్తి వడ్డీ రాయితీని ప్రభుత్వం అందజేస్తోంది. ఇప్పటికే మూడు విడతలు వైఎస్సార్ సున్నా వడ్డీ పథకంలో నిధులు అందజేసిన ప్రభుత్వం నాలుగో విడత నిధులు జమ చేయనుంది. ఈ నెల 26న కోనసీమ జిల్లా అమలాపురంలో వైఎస్సార్ సున్నా వడ్డీ నాలుగో విడత పథకం డబ్బులను సీఎం ముఖ్యమంత్రి చేతుల మీదుగా విడుదల చేసేందుకు అధికారులు ఏర్పాట్లు చేశారు.



వెంకటాపురం పరిధిలో సమావేశం నిర్వహిస్తున్న డ్వాక్రా మహిళలు (ఫైల్)

అయితే భారీ వర్షాల కారణంగా సీఎం అమలాపురం పర్యటన రద్దు కావడంతో సున్నా వడ్డీ నాలుగో విడత నిధుల విడుదలకు కొంతమేర ఆలస్యమైనట్టు అధికారులు చెబుతున్నారు. త్వరలోనే నిధులను సీఎం విడుదల చేయనున్నారు.

ఏలూరు నియోజకవర్గంలో..

ఏలూరు నియోజకవర్గం పరిధిలో వైఎస్సార్ సున్నా వడ్డీ పథకంలో 1,565 గ్రూపులకు చెందిన 15,650 మందికి నాలుగో విడత రూ.19.23 కోట్ల మేరకు లబ్ధి చేకూరనుంది. ఇప్పటికే మూడు విడతల్లో సున్నా వడ్డీని ప్రభుత్వం విడుదల చేయడంతో లబ్ధిదారులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. వైఎస్సార్ సున్నా వడ్డీ పథకానికి సంబంధించి 2022 ఏప్రిల్ 1 నుంచి ఈ ఏడాది మార్చి 31 వరకు మహిళలు చెల్లించిన బ్యాంకు రుణాలకు సంబంధించి వడ్డీ రాయితీని ప్రభుత్వం అందించనుంది.

జగన్‌కు రుణపడి ఉంటాం



సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ఇచ్చిన మాట ప్రకారం డ్వాక్రా సంఘాలకు వడ్డీ రాయితీని అందిస్తున్నారు. ఇప్పటికే మూడు విడతలు సున్నా వడ్డీ పథకంలో సొమ్ములు అందించారు. త్వరలో నాలుగో విడత సున్నా వడ్డీ నిధులు విడుదల చేయడం సంతోష దాయకం. రాష్ట్రంలోని డ్వాక్రా మహిళలు సీఎం వైఎస్ జగన్‌కు ఎంతో రుణపడి ఉంటాం.

– కొమ్మూరి అరుణ, డ్వాక్రా మహిళ, ఏకెజీ సెంటర్, 43వ డివిజన్

సాయం మరువలేనిది



పాదయాత్ర సందర్భంగా ఇచ్చిన హామీలను సీఎం జగన్ ఇచ్చిన మాటను నిలబెట్టుకుంటున్నారు. మహిళలకు జగన్ అందిస్తోన్న సహకారం మరువలేనిది. బ్యాంకు లింకేజీ రుణాలు, స్త్రీనిధి, ఆసరా, అమ్మఒడి, సున్నా వడ్డీ పథకాల ద్వారా అందిస్తున్న చేయూతతో ఆర్థిక పరిపుష్టి సాధించగలుగుతున్నాం.

– మణ్యం జ్యోతి, డ్వాక్రా మహిళ, కునిశెట్టివారి వీధి, 43వ డివిజన్

నేరాల నియంత్రణకు నిత్యం నిఘా



వన్‌టౌన్ స్టేషన్‌లో చర్చిస్తున్న సీఐలు రాజశేఖర్, చంద్రశేఖర్, శివాజీ

ఏలూరు టౌన్: ఏలూరు నగరంలో నేరాలను నియంత్రణ, రౌడీలు, అసాంఘిక శక్తుల కదలికలపై నిత్యం నిఘా ఉంచుతూ ప్రజలకు శాంతిభద్రతల పరిరక్షణకు ప్రత్యేక ప్రణాళికతో ముందుకెళ్లాలని నగర సర్కిల్ ఇన్‌స్పెక్టర్లు నిర్ణయించారు. ఎస్పీ డి.మేరీ ప్రశాంతి ఆదేశాల మేరకు డీఎస్పీ ఈ.శ్రీనివాసులు పర్యవేక్షణలో నగరంలో నేరాల కట్టడికి శనివారం వన్‌టౌన్ సర్కిల్ స్టేషన్‌లో వన్‌టౌన్ సీఐ ఎస్.రాజశేఖర్, టూటౌన్ సీఐ పి.చంద్రశేఖర్, త్రీటౌన్ సీఐ కోమాకుల శివాజీ ప్రత్యేకంగా సమావేశమయ్యారు. నేరాలకు పాల్పడేందుకు నేరస్తులు భయపడేలా కఠినంగా వ్యవహరిస్తామన్నారు. విద్యాసంస్థల వద్ద ఆకతాయిల ఆగడాలను కట్టడి చేస్తామన్నారు. నగరంలో అసాంఘిక కార్యకలాపాలను అడ్డుకుంటామని చెప్పారు. నగరంలో ట్రాఫిక్ సమస్య పరిష్కారానికి, చోరీల నివారణకు చర్యలు తీసుకుంటామన్నారు. పోలీస్ స్టేషన్లకు వచ్చే బాధితులకు సత్వర న్యాయం అందించే దిశగా, నిందితులకు శిక్షలు పడేలా ప్రత్యేక శ్రద్ధ వహిస్తామని తెలిపారు.

క్లుప్తంగా

మణిపూర్‌లో రాష్ట్రపతి పాలన విధించాలి



కలెక్టరేట్ వద్ద ధర్నా చేస్తున్న దళితసేన నాయకులు, కార్యకర్తలు

ఏలూరు (టూటౌన్): మణిపూర్ రాష్ట్రంలో రాష్ట్రపతి పాలన విధించాలని దళితసేన రాష్ట్ర వ్యవస్థాపక అధ్యక్షుడు జిజ్జువరపు రవిప్రకాష్ కోరారు. స్థానిక కలెక్టరేట్ వద్ద మణిపూర్ ఘటనలను నిరసిస్తూ శనివారం ధర్నా చేశారు. మణిపూర్‌లో జరిగిన హత్యలు, అత్యాచారాలపై సుప్రీంకోర్టు సిట్టింగ్ జడ్జిచే విచారణ చేయించాలని కోరారు. ఈ ఘటనలకు కారకులైన వారిని చట్ట ప్రకారం కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. మణిపూర్ ప్రభుత్వాన్ని బర్తరఫ్ చేయాలన్నారు. కార్యక్రమంలో దళిత సేన రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కాకర్లమూడి వెంకటరావు, రాష్ట్ర కార్యదర్శి షేక్ సయ్యద్ బాజీ, నాయకులు చీలి మోహనరావు, బేతాల జయసుధ, మధుమంచి విజయ, లక్కపాము చంటి, పింగుల ఇథియా, విస్సన్నపల్లి సురేష్ తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): స్థానిక అశోక్ నగర్ విద్యుత్ సబ్ స్టేషన్ పరిధిలో వార్షిక మరమ్మతులు, చెట్ల కొమ్మలు తొలగింపు పనుల నిమిత్తం ఆదివారం నగరంలోని వివిధ ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్టు ఈపీడీసీఎల్ ఏలూరు డివిజన్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ టి.శశిధర్ ఒక ప్రకటనలో తెలిపారు. రామచంద్రరావు పేట, పరిసర ప్రాంతాల్లో ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదని పేర్కొన్నారు.

నేడు కాపు విద్యార్థులకు పతకాలు

ఏలూరు (టూటౌన్): పది, ఇంటర్ ఫలితాల్లో ఉత్తమ ప్రతిభ చూపిన 100 మంది కాపు విద్యార్థులకు ఈ నెల 30 ఆదివారం ఉదయం స్థానిక కాశీవిశ్వేశ్వర కల్యాణ మండపంలో రజత పతకాలు అందజేస్తామని కాపు సంక్షేమ సేన జిల్లా అధ్యక్షుడు పులి శ్రీరాములు తెలిపారు. టెన్త్‌లో 500, ఇంటర్‌లో 900 పైబడి మార్కులకు సాధించిన కాపు విద్యార్థులను ప్రోత్సహిస్తున్నట్టు చెప్పారు.

జూదరుల అరెస్ట్

ఏలూరు టౌన్: ఏలూరు రూరల్ ఎన్టీఆర్ నగర్‌లో పేకాట శిబిరం నిర్వహిస్తున్నారనే సమాచారంతో ఏలూరు వన్‌టౌన్ సీఐ ఎస్.రాజశేఖర్ ఆదేశాల మేరకు పోలీసులు శనివారం దాడి చేశారు. పేకాట ఆడుతున్న 10 మందిని అరెస్టు చేశారు. వారి నుంచి రూ.65 వేలు స్వాధీనం చేసుకున్నారు.

వర్షం, మురుగునీటి పారుదలకు చర్యలు



తంగెళ్లమూడి మెయిన్‌రోడ్డులో పాత డ్రెయినేజీలో పూడిక తీయిస్తున్న కార్పొరేటర్ శ్రీనివాస్



నేతాజీనగర్ ప్రాంతంలో కచ్చా డ్రెయిన్ తవ్విస్తున్న శ్రీనివాస్



వర్షపునీరు బయటకెళ్లేలా పొక్లెయిన్‌తో మార్గం ఏర్పాటుచేయిస్తున్న కార్పొరేటర్ సబ్బన శ్రీనివాస్

ఏలూరు టౌన్ : భారీ వర్షాలతో నగరంలోని పలు ప్రాంతాలు నీట మునిగాయి. ప్రజలకు ఇబ్బందుల్లేకుండా డ్రెయినేజీలో వ్యర్థాలు, పూడిక తీత పనులు చేపట్టారు. ఏలూరు తంగెళ్లమూడి 49వ డివిజన్ పరిధిలో చాలా ప్రాంతాలు భారీ వర్షాలకు నీట మునిగాయి. డ్రెయినేజీ సౌకర్యం లేకపోవటం కొన్ని చోట్ల ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. కార్పొరేటర్ దేవరకొండ శ్రీనివాస్ ప్రజల సమస్యను పరిష్కరించేందుకు చర్యలు తీసుకున్నారు. ఎమ్మెల్యే ఆళ్ల నాని ఆదేశాలతో నగర కమిషనర్ సంక్రాంతి వెంకటకృష్ణ దృష్టికి సమస్యను తీసుకెళ్లి డివిజన్‌లోని లక్ష్మీనగర్, నేతాజీ నగర్, కబాడీగూడెం ప్రాంతాల్లో వర్షపు నీరు నిల్వలేకుండా చర్యలు చేపట్టారు. కొన్ని చోట్ల పొక్లెయిన్‌తో కచ్చా డ్రెయినేజీ తవ్వించారు. తంగెళ్లమూడి ప్రధాన రహదారి సమీపంలో డ్రెయినేజీ పూడుకుపోవటంతో గ్యాంగ్ వర్క్ చేయించి, పూర్తిగా మురుగునీటి పారుదల ఉండేలా పనులు చేయించారు. ఏలూరు వన్‌టౌన్ 9వ డివిజన్ ప్రాంతంలో మేకల కబేళా, కుస్తీల దొడ్డి ప్రాంతంలో భారీ వర్షాలకు నీరు నిల్వ ఉండపోయి, పిచ్చి మొక్కలు పెరిగిపోయి దోమలు విజృంభిస్తున్నాయంటూ ప్రజలు ఫిర్యాదు చేయడంతో కార్పొరేటర్ సబ్బన శ్రీనివాస్ సమస్యను నగర కమిషనర్ వెంకటకృష్ణ దృష్టికి తీసుకెళ్లి మురుగునీటి పారుదలకు ఏర్పాట్లు చేశారు. పిచ్చి మొక్కలను తొలగించేలా చర్యలు చేపట్టారు. నగరంలో పలువురు కార్పొరేటర్లు ప్రజా సమస్యల పరిష్కారానికి చర్యలు చేపట్టడంతో ప్రజలు సంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.

త్యాగానికి ప్రతీక మొహర్రం

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): ఇస్లాం ధర్మస్థాపనకు ప్రాణత్యాగం చేసిన ముహమ్మద్ ప్రవక్త మనుమడు హజరత్ ఇమామ్ హుస్సేన్ త్యాగానికి ప్రతీకగా భావించే మొహర్రంను నగరంలో ముస్లింలు వైభవంగా నిర్వహించుకోవడం అభినందనీయమని ఎమ్మెల్యే ఆళ్ల నాని అన్నారు. శనివారం నగరంలోని కుండీ సెంటర్‌లోని గొలుసుల పంజాలో నిర్వహించిన మొహర్రం కార్యక్రమంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. నగరంలో హిందూ ముస్లింలు సోదర భావంతో మెలుగుతూ ఆరోగ్యకరమైన వాతావరణాన్ని నెలకొల్పడం అనాది నుంచీ వస్తోందని, ఇప్పటికీ అదే సంప్రదాయం కొనసాగించడం ఆహ్వానించదగ్గ పరిణామమని అన్నారు. కర్బలా యుద్ధంలో మరణించిన ఇమామ్ హుస్సేన్‌ను స్మరిస్తూ అమరవీరుల నెలగా ముస్లింలు ఈ నెలను పరిగణించి పండుగలా కాకుండా వర్ధంతిలా నిర్వహిస్తారని నాని వివరించారు. ఇస్లాం నూతన సంవత్సరం ప్రారంభమయ్యే ఈ నెల నుంచి ముస్లింలు నూతన ఆలోచనలతో, సకల సౌఖ్యాలతో జీవించాలని అల్లాహ్‌ను వేడుకుంటున్నట్టు చెప్పారు. గొలుసుల పంజాలో నిర్వహించిన అన్నదాన కార్యక్రమంలో నాని భక్తులకు అన్నప్రసాదం పంపిణీ చేశారు. కార్యక్రమంలో నగర మేయర్ షేక్ నూర్జహాన్, పెదబాబు దంపతులు, ఏఎంసీ చైర్మన్ నెరుసు చిరంజీవులు, వైఎస్సార్‌సీపీ నాయకులు ఎంఆర్‌డీ బలరాం, బొద్దాని శ్రీనివాస్, గొలుసుల పంజా వంశపారంపర్య ముజావర్లు ఎండీ వజీర్ అలీ, ఎండీ గాలబ్ అలీ, ఎండీ మౌలా అలీ తదితరులు పాల్గొన్నారు.

పీర్లు నిలబెట్టి ప్రార్థనలు

మొహరం నెల ప్రారంభానికి సూచికగా నగరంలోని నగరంలోని గస్ బజారు ప్రాంతంలో జల్‌జలా సాహెబ్ ఆస్థాన, గడియారం స్తంభం సెంటర్‌లోని బీ ఫాతిమా పంజా, పోణంగి రోడ్డులోని కోడిగుడ్డు పంజా, చేపలతూము సెంటర్‌లోని సింగమహల్లా పంజాల్లో సైతం పీర్లు నిలబెట్టి ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. మధ్యాహ్నం నుంచి వివిధ ప్రాంతాల్లో నిలబెట్టిన పీర్లను విశేషంగా పూలు, నూతన వస్త్రాలతో అలంకరించి, మేళతాళాలతో భారీ ఊరేగింపుగా స్థానిక కర్బలా మైదానం వరకూ తీసుకువచ్చారు. అనంతరం కర్బలా మైదానంలో ఆయా ప్రాంతాల నుంచి వచ్చిన పీర్లను నిమజ్జనం చేశారు. నగరానికి చెందిన అంజుమన్ ముహాఫిజుల్ ఇస్లాం సంస్థ ప్రతినిధులు కర్బలా మైదానంలో పానకం పంపిణీ చేశారు. కార్యక్రమంలో గస్‌బజార్ సెంటర్‌లోని జల్‌జలా సాహెబ్ ఆస్థాన అధ్యక్షుడు రాజా అహ్మద్, ముజావర్ల సంఘం అధ్యక్షుడు ఎండీ ఇక్బాల్, ఎండీ షబ్బీర్ అలీ, ఎండీ అస్లాం అలీ, ఎండీ నదీమ్, అంజుమన్ సంస్థ అధ్యక్ష, కార్యదర్శులు ఎండీ సులేమాన్, ఎండీ అమీర్ జాని, కార్పొరేటర్ ఎండీ ఇలియాస్ పాషా తదితరులు పాల్గొన్నారు.



గొలుసుల పంజాలో ప్రత్యేక ప్రార్థనల్లో పాల్గొన్న ఎమ్మెల్యే నాని, నగర మేయర్ నూర్జహాన్ తదితరులు



పీర్లతో ఊరేగింపులో పాల్గొన్న జల్‌జలా సాహెబ్ ఆస్థాన ప్రతినిధులు

వలంటీర్లకు వందనం

నిస్వార్థ సేవకులు



అవినీతికి పాల్పడకుండా వలంటీర్లు సేవ చేస్తున్నారు. వారి వల్లే ప్రభుత్వ సేవలు ప్రజలకు అందుతున్నాయి. నా లాంటి ఎందరో పేదలు అమ్మఒడి, జగనన్న దీవెన, చేయూత పథకాలు అందుకుంటున్నారంటే వలంటీర్ల వల్లే. వలంటీర్లను దూషిస్తే పేదలు సహించరు. వలంటీర్ లేకపోతే పథకాల గురించి మాకెవరు చెబుతారు. సీఎం జగన్ పేదల మేలు కోసమే వలంటీర్ వ్యవస్థను తీసుకొచ్చారు.

– కె గంగాభవాని, చాటపర్రు

విమర్శలు సరికాదు



వలంటీర్లపై పవన్ కళ్యాణ్, చంద్రబాబు, లోకేష్ ఇష్టం వచ్చినట్టు మాట్లాడడం మంచిది కాదు. గతంలో కులం సర్టిఫికెట్ కావాలని తహసీల్దార్ కార్యాలయానికి వెళితే, టీసీ కావాలన్నారు. లేదంటే కుటుంబ సభ్యుల కులం సర్టిఫికెట్ జత చేయాలన్నారు. రెండు జత చేసి దరఖాస్తు చేస్తే నెలరోజులు ఆగాలన్నారు. ఇప్పుడు వలంటీర్ మాతో దరఖాస్తు చేయించిన మరుసటి రోజే ధ్రువ పత్రం అందించాడు.

– సీహెచ్ పార్వతి, చాటపర్రు

డిగ్రీ కళాశాల గోల్డెన్ జూబ్లీ వేడుకలకు ఏర్పాట్లు

ఉంగుటూరు: నారాయణపురం అరవింద శత జయంతి ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఏర్పాటు చేసి 50 ఏళ్లు పూర్తయ్యింది. అరవిందుని 150వ జయంతి సందర్భంగా కళాశాలలో ఆగస్టు 12,13 తేదీల్లో గోల్డెన్ జూబ్లీ వేడుకలు నిర్వహించాలని పూర్వ విద్యార్థుల సంఘం కార్యవర్గ సభ్యులు నిర్ణయించారు. ఈమేరకు సంఘం అధ్యక్షుడు ఈపూరి సత్యనారాయణ, కార్యదర్శి సాగిరాజు జానికి రమరాజు, కార్యవర్గ సభ్యులు బొమ్మిడి అప్పారావు, పీడీ ఆదిరెడ్డి సత్యనారాయణ తదితరులు శనివారం మరోమారు సమావేశం నిర్వహించారు. వేడుకలకు హాజరుకావాలని, పూర్వ విద్యార్థుల అడ్రస్సులు తెలిసినవారు సెల్ నెంబర్ 93469 51225లో తెలియజేయాలని కోరారు. కార్యక్రమానికి ఉన్నత విద్యాశాఖ కమిషనర్, ఎమ్మెల్యే వాసుబాబు, ఎంపీ కోటగిరి శ్రీధర్‌ను ఆహ్వానించాలని నిర్ణయించారు.

ఆర్టీసీ సమాచారం

ఏలూరు ఆర్టీసీ డిపో నుంచి దూరప్రాంతాలకు వెళ్లే బస్సుల సమయాలు, రిజర్వేషన్ వివరాలు

ఏసీ బస్సులు..

బస్సు రూటు	సమయం	అందుబాటులో ఉన్న సీట్లు
ఏలూరు –బీహెచ్‌ఈఎల్ వయా విజయవాడ (ఇంద్ర)	21.00	28
ఏలూరు –బీహెచ్‌ఈఎల్ వయా ఖమ్మం (ఇంద్ర)	21.00	24
ఏలూరు – బీహెచ్‌ఈఎల్ (అమరావతి)	22.00	20
ఏలూరు – తిరుపతి(ఇంద్ర)	19.00	24

సూపర్ లగ్జరీ

బస్సు రూటు	సమయం	సర్వీస్ నంబర్	అందుబాటులో ఉన్న సీట్లు
ఏలూరు –బీహెచ్‌ఈఎల్	21.45	4820	06
ఏలూరు –బీహెచ్‌ఈఎల్ వయా కే.కోట	19.30	4796	03
ఏలూరు –బీహెచ్‌ఈఎల్ వయా రామచంద్రపురం	19.45	4798	08
ఏలూరు –జీడిమెట్ల వయా ఖమ్మం	20.15	4804	02
ఏలూరు –ఈసీఐఎల్	22.30	4814	17
ఏలూరు – బీహెచ్‌ఈఎల్	22.15	34820	15
ఏలూరు –బీహెచ్‌ఈఎల్	09.00	4794	రద్దు
ఏలూరు – విశాఖపట్నం	12.00	4840	34
ఏలూరు –విశాఖపట్నం	22.00	4838	32
ఏలూరు –తిరుపతి	16.00	4830	33

పంటబోదెల ప్రక్షాళనకు చర్యలు

- ఆక్రమణల పరిశీలన
- ఏఓ జీవనసంధ్య

ఏలూరు రూరల్: పంటబోదెల ఆక్రమణలు తొలగించాలని ఉన్నతాధికారులు ఆదేశించారని ఏలూరు మండల వ్యవసాయ అధికారిణి ఎ.జీవనసంధ్య తెలిపారు. శుక్రవారం సాయంత్రం ఏడీఏ రామకృష్ణ, ఏడీ వై.సుబ్బారావు, డీఏఏ స్వర్ణలతతో పాటు ఇరిగేషన్ అధికారులు పోణంగి, జాలిపూడి, తంగెళ్లమూడిలో ముంపునకు గురైన చేలు, ఆక్రమణకు గురైన పంటబోదెలను పరిశీలించారు. పోణంగిలో చేల ముంపుకు కారణమైన పుంత బోదెల ఆక్రమణలను ఆదివారం తొలగిస్తామని ఏఓ తెలిపారు. తహసీల్దార్ బి.సోమశేఖర్ ఆదేశాల మేరకు రెవెన్యూ సిబ్బంది పంటబోదెను పరిశీలించారని చెప్పారు. బోదెను ప్రక్షాళన చేసి ముంపు సమస్య లేకుండా చేస్తామన్నారు.

పట్టించుకోని ఇరిగేషన్ అధికారులు

ఇరిగేషన్ అధికారులు వ్యాసగాని నది ఆక్రమణ పట్టించుకోవడం లేదని రైతులు వాపోయారు. తంగెళ్లమూడి ఆర్టీసీ కాలనీ దిగున 100 ఎకరాలు ఏటా ముంపుబారిన పడుతున్నప్పటికీ అధికారులు కన్నెత్తి చూడడం లేదన్నారు. చేలకు దిగువన వ్యాసగాని నది గట్టును ప్లాస్టిక్ వ్యర్థాలతో వ్యాపారం చేస్తున్న కొందరు వ్యక్తులు ఆక్రమించారని రైతులు వివరించారు. ఈ ఆక్రమణ వల్ల ఏటా చేలు ముంపుబారిన పడి నష్టపోతున్నామని వాపోయారు. దీనిపై ఇరిగేషన్ అధికారులకు ఎన్నిసార్లు మొరపెట్టుకున్న నా పరిధిలో లేదు అంటున్నారని వాపోయారు. మరోపక్క వర్షాలు తగ్గుముఖం పట్టడంతో చేలలో మురుగు నీరు క్రమేపీ కిందకు పారుతోంది. జిల్లా కలెక్టర్ స్పందించి సమస్యకు శాస్వత పరిష్కారం చూపాలని రైతులు కోరుతున్నారు.



జాలిపూడిలో ముంపు నుంచి తేరుకుంటున్న నాట్లను పరిశీలిస్తున్న అధికారులు



పోణంగిలో నీట మునిగిన నాట్లు

డాక్టర్ అనుచిత వ్యాఖ్యలపై నిరసన



ఆసుపత్రి వద్ద ఆందోళన చేస్తున్న రోగి బంధువులు

ఏలూరు టౌన్ : అధికంగా డబ్బులు వసూలుపై ప్రశ్నించటంతో ఏలూరు ఎస్ఆర్‌పేటలోని ప్రైవేటు సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ యాజమాన్యం తమపై అనుచిత వ్యాఖ్యలు చేశారంటూ రోగి భర్త, బంధువులు ఆందోళన చేశారు. తన భార్య వ్యక్తిత్వాన్ని కించపరిచేలా తీవ్ర పదజాలంతో దూషించటంపై భర్తతోపాటు, బంధువులంతా హాస్పిటల్ మెట్లపై బైఠాయించారు. భారీగా డబ్బులు వసూలు చేస్తూ రోగుల కుటుంబాలతో ఆడుకుంటున్న డాక్టర్‌పై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. బాధితుల కథనం మేరకు.. పెదవేగి మండలం కూచింపూడి గ్రామానికి చెందిన ఆలంపల్లి రాజు తన భార్య కనకదుర్గకు గాల్‌బ్లాడర్‌లో రాళ్లు ఉండడంతో ఏలూరు ఎస్ఆర్‌పేటలోని ఓ సూపర్‌స్పెషాలిటీ హాస్పిటల్‌కు వైద్యం నిమిత్తం మూడు రోజుల క్రితం చేర్పించారు. చికిత్సల నిమిత్తం రూ.48 వేలు ప్యాకేజీ మాట్లాడుకున్నారు. ప్యాకేజీకి మందులకు రూ.10 వేలు, టెస్టులకు మరో రూ.3 వేలు చెల్లించానని తెలిపారు. మరోసారి రూ.2500 చెల్లించాలని సిబ్బంది చెప్పటంతో హాస్పిటల్ ఎండీ వద్దకు వెళ్లగా ఆయన తీవ్రమైన పదజాలంతో తనను, తన భార్య వ్యక్తిత్వాన్ని దెబ్బతీసేలా వ్యాఖ్యలు చేశారని ఆరోపించారు. ఐసీయూలోని తన భార్యపై నీచమైన రీతిలో మాట్లాడుతూ నన్ను దూషించారని ఆమె భర్త రాజు వివరించారు. తనకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు.

ఫోన్ కట్‌చేసిన ఎండీ

ఇదే విషయంపై హాస్పిటల్ ఎండీని ఫోన్‌లో వివరణ కోరగా ఆయన సమాధానం చెప్పేందుకు నిరాకరించారు. ఏమీ కాలేదంటూ ఫోన్ పెట్టేశారు. ఏలూరు త్రీటౌన్ సీఐ కోమాకుల శివాజీ ఇరు వర్గాలను పోలీస్‌స్టేషన్‌కు తీసుకెళ్లి వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఇరు వర్గాలకు కౌన్సిలింగ్ ఇచ్చి పంపామని, కేసులేమీ నమోదు చేయలేదని ఆయన తెలిపారు.